క్లుప్తంగా

6న 'దొందూ.. దొందే' నాటిక ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో జూలై 6న భద్రం ఫౌండేషన్ సొసైటీ, గోపాలపట్నం వారిచే 'దొందూ..దొందే' నాటిక ప్రదర్శన ఉంటుందని రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు చిట్టి వెంకటరావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 297వ నెల కార్యక్రమంలో భాగంగా నాటిక ప్రదర్శన ఉంటుందని, అభిమానులంతా హాజరు కావాలని కోరారు.

నేడు ద్విశతావధాన కళా విలాసం కరపత్రం ఆవిష్కరణ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీసుమిత్ర కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ద్విశతావధాన కళా విలాసం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఉదయం 10 గంటలకు అనివెట్టి మండపంలో ఆవిష్కరిస్తున్నట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బ్యాంకు అధికారులకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక యూనియన్ బ్యాంకులో పనిచేసి బదిలీపై వెళ్లిన మురళీ, గౌతమ్‌లను శుక్రవారం సాయంత్రం బ్యాంకు ఆవరణలో మేనేజర్ శాంతకుమార్ ఘనంగా సత్కారం చేశారు. ఖాతాదారులకు సకాలంలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి బోస్, సర్పంచ్ భూపతి సురేష్‌కుమార్, రమణయ్య, జల్లేపల్లి శ్రీనివాసరావు, ఐవీ అప్పారావు, కొనగింజి సూర్యనారాయణ, తవిటిరాజు, కుదిరేళ్ల గోవిందరావు, జగ్గు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయం విద్యార్థులకు అభినందన



లీలాకృష్ణ, బలరాంలను అభినందిస్తున్న స్వాతిసోమనాథ్

శ్రీకాకుళం కల్చరల్: సంప్రదాయం కూచిపూడి గురుకులానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఏపీపీజీ సెట్‌లో ర్యాంకులు సాధించారని సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్ తెలిపారు. కూచిపూడిలో పీజీ కోర్సు చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో లీలాకృష్ణకు 5వ ర్యాంకు, గిరిజన విద్యార్థి బలరాంకు 8వ ర్యాంకులు వచ్చాయన్నారు. భవిష్యత్తులో మంచి కూచిపూడి డ్యాన్సర్లుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

శ్రీకూర్మంలో పారిశుద్ధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న అధికారులు

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని సెగిడిపేట వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మండల ప్రత్యేకాధికారి బి.రమణమూర్తి శుక్రవారం పరిశీలించారు. రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తను జేసీబీ వాహనంతో తొలగించారు. గ్రామాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో చెట్టు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని పున్నాం గ్రామంలో సర్పంచ్ సుంకరి అప్పన్న ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం రాయితీపై వివిధ రకాల వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఎరువుల కూడా రైతుకు సకాలంలో పంపిణీ చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమరాపు సుగణకరరావు, నాయకులు సత్యం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న దేవీ విగ్రహానికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

● వ్యాధులపై అప్రమత్తం



వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారి శోభారాణి అన్నారు. బలగ సెక్టార్‌లో ఉన్న సానావీధి-1, 2 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోద, హెచ్‌వీ బి.లక్ష్మి, ఏఎన్ఎం సూర్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.లక్ష్మి, బి.ఇందిరా, ఆశా కార్యకర్తలు శిరీష, రామలక్ష్మి పాల్గొన్నారు.

– శ్రీకాకుళం అర్బన్

● ముమ్మరంగా వాహన తనిఖీలు



శ్రీకాకుళం నగరంలోని బలగ ఏసీబీ కార్యాలయం కూడలి వద్ద రెండో పట్టణ పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఏఎస్ఐ శంకరరావు ఆధ్వర్యంలో సిబ్బంది లైసెన్సు, ఇన్సూరెన్సు, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ రైడింగ్ వంటి నిబంధనలు అతిక్రమించిన 14 మందికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

● సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, మహన్యాస పూర్వక నమక చమక సహిత పంచ సూక్తాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం పరిమళ సుగంధ ద్రవ్యాలు, యాలకులు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీసూక్త విధానంలో షోడశోపచార సహిత సహస్ర నామార్చనలు, విశేష కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళం కల్చరల్

క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం కల్చరల్: క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే ప్రాణాంతకం కాదని రిమ్స్ వైద్యులు డాక్టర్ సత్య స్వరూప్ తెలిపారు. నగరంలోని సన్ షైన్ స్కూల్లో లైన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో చైల్డ్ హుడ్ క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గుండెపోటు తర్వాత ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణవుతున్న మహమ్మారి క్యాన్సర్ అని పేర్కొన్నారు. ఔషధాలు, చికిత్స ఉన్నప్పటికీ సకాలంలో గుర్తించకపోతే వ్యాధి ప్రాణాంతకమవుతుందన్నారు. ఆగని దగ్గు, పేగుల కదలికల్లో మార్పులు, గడ్డలు, వాపులు, పుట్టుమచ్చల్లో మార్పులు,



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యస్వరూప్

కారణం లేకుండా బరువు తగ్గడం, తగ్గని నొప్పులు, ఆహారం మింగడానికి ఇబ్బంది పడటం, మూత్రంలో రక్తం పడటం తదితర లక్షణాలు క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారిలో కనిపిస్తాయన్నారు. చిన్నారులు బయట కాకుండా ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ హర్షవల్లి జోనల్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి, విశ్రాంత అడిషనల్ డీఎంహెచ్ఓ లయన్ డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, ఉపాధ్యక్షులు లయన్ వావిలపల్లి జగన్నాథనాయుడు, సన్ షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్, ట్రెజరర్ తర్లాడ అప్పలనాయుడు, మజ్జి సుమన్, లక్ష్మీకాంత్, మణి శర్మ, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ముద్దాడ బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం టి.నారాయణరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల భాగస్వామ్యం పాఠశాల విద్యలో కీలకమన్నారు. ప్రభుత్వం పుస్తకాలు, స్టూడెంట్ కిట్లు, మధ్యాహ్న భోజనం వంటివి అందజేస్తోందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యా బోధన అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు కె.కొండయ్య, బి.భవానీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్ఎం నారాయణరావు

మాజీ ఎమ్మెల్యే కిరణ్ పరామర్శ



కృష్ణతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లోలుగు కృష్ణ తండ్రి లోలుగు లక్ష్మీనారాయణ శుక్రవారం మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, నాయకులు మహంతయ్య, పిన్నింటి శ్రీచరణ్, గొర్లె మంగయ్యగారి రమణ తదితరులు ఉన్నారు.

'పాత పింఛన్ విధానం అమలు చేయాలి'

రణస్థలం: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరామ్ ప్రసాద్ కోరారు. మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రణస్థలం మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 117జీవో రద్దు చేయాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ సమావేశంలో ఏపీయూఎస్ రణస్థలం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆపస్ మండల అధ్యక్షుడిగా జి.చిన్నికృష్ణం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సింగూరు రాజు, ఆర్థిక కార్యదర్శిగా బి.కుమార్, ఉపాధ్యక్షుడిగా వి.వేణుగోపాల్‌ను ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శులు ఎం.రవిభట్టు, జి.గిరి, ఎస్.శ్రీధర్, ఎల్.సత్యం తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయుల సమస్యలను వివరిస్తున్న ఆపస్ సంఘ సభ్యులు

ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బూర్జ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని మజ్జి లావణ్య ప్రతిభ కనబర్చింది. మార్చిలో వెలువడిన ఫలితాల్లో 403 మార్కులు సాధించగా తెలుగు, ఫిజిక్స్ పేపర్లకు ఇంప్రూవ్‌మెంట్ కోసం ఫీజులు చెల్లించి సప్లమెంటరీ పరీక్షలు రాసింది. ఈ ఫలితాల్లో లావణ్య 37 మార్కులు అదనంగా కలిసి మొత్తం 440 మార్కులు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు, రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.



మజ్జి లావణ్య

పీజీసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. తాజాగా విడుదలైన ఏపీ పీజీసెట్ ఫలితాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో శిరీష దుద్ది 7వ ర్యాంక్‌తోపాటు100 లోపు 13, 16, 21, 24, 53, 66, 76 వంటి ర్యాంకులు సాధించగా, మ్యాథ్స్ విభాగంలో 15, 80 ర్యాంకులు, ఫిజికల్ సైన్స్ విభాగంలో 25, 32 ర్యాంకులు, స్టాటిస్టిక్స్ విభాగంలో 64, 100 ర్యాంకులు, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 90వ ర్యాంకులు సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ శుక్రవారం అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు పాల్గొన్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

నేడు ఉమాజఠలేశ్వరాలయ వార్షికోత్సవం



శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం జరుగుతుందని ఆలయ ధర్మకర్త బి.అశ్వినీకుమార్, అర్చకులు మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి 108 కలశాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుందని, సాయంత్రం ఉమాజఠలేశ్వరస్వామికి కల్యాణ వేడుకలు సంప్రదాయంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

కబడ్డీ అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే శిరీషను కలిసిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కబడ్డీ అభివృద్ధికి సహాయ సహకారాలను అందించాలనిజిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కేని చిరంజీవిరావు నేతృత్వంలో సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిశారు. జిల్లాలో, రాష్ట్రంలో స్వార్థప్రయోజనాల కోసం ఏర్పాటైన కబడ్డీ సంఘాల ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులు, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రక్షాళన చేయడం, కబడ్డీ క్రీడాభివృద్ధికి కావాల్సిన కనీస సౌకర్యాలు, వసతులపై చర్చించారు.

ఆశీల వేలంపాట నేడు

కొత్తూరు: మండల కేంద్రంలోని కర్లెమ్మ మార్కెట్ రోజువారీ ఆశీల వసూలు వేలంపాట ఈనెల 29వ తేదీన సాయంత్రం 3 గంటలకు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు ప్రకటనలో తెలిపినవిధంగా పత్రాలు సమకూర్చుకొని పాల్గొనాలని కోరారు.

యరగాం గ్రామానికి బస్సు సౌకర్యం

సరుబుజ్జిలి: మండలంలోని యరగాం గ్రామానికి అధికారులు శుక్రవారం ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిపించారు. గతంలో ఉన్న బస్సు సర్వీసును కొన్ని కారణాలు వలన అధికారులు నిలిపివేశారు. బస్సు పునరుద్ధరణ కోసం టీడీపీ యువనేత గురువు తిరుమలరావు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహనాయుడు, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

హిరమండలం: స్థానిక పిండ్రువాడ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి చిన్నారుల తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. ఉపాధ్యాయులు ఇచ్చిన పిలుపు మేరకు గ్రామంలో ఎక్కువ మంది పూర్వ ప్రాథమిక విద్య చదివేందుకు ముందుకొచ్చారు. ముఖ్య అతిథిగా ఎంఈవో రాంబాబు విచ్చేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతుండడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, దీనకుమారి, గిరిబాబు, తారక రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం

జూలై 1న సర్వసభ్య సమావేశం

జలుమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూలై 1వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని కోరారు.

'వేగవంతంగా తోటపల్లి కాలువ మరమ్మతులు'

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు, రణస్థలం రైతులకు సాగునీరు అందించే తోటపల్లి కాలువ మరమ్మతుల పనులు వేగవంతం చేస్తున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని బిపివరకట్టు ప్రాంతంలో 12వ కిలోమీటర్ నుంచి పూడికల పనులను పూజలు చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి కాలువ వలన నియోజకవర్గంలోని 42 వేలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఈ మూడు కిలోమీటర్లు పూడికలు తీసిన వెంటనే రైతులకు సాగునీరు అందిస్తామని తోటపల్లి అధికారులు వివరించారు. కార్యక్రమంలో తోటపల్లి డీఈ హరి ప్రసాద్, జేఈ రామలక్ష్మి, కుటమి నాయకులు ముప్పిడి సురేష్, డీజీఎం ఆనందరావు, తోటయ్యదొర, లంక శ్యామ్, పిన్నింటి భాను తదితరులు పాల్గొన్నారు.



పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

తాగునీటి సమస్యలకు సత్వర పరిష్కారం

జి.సిగడాం: గ్రామాల్లో తాగునీటి సమస్యలపై 24 గంటల్లో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని రూరల్ డవలప్‌మెంట్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని డీఆర్‌వలస, పున్నాం, బాతువ, ఎందువ గ్రామాల్లో తాగునీటి బోర్లు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారుగా 40 మంచినీటి రక్షిత ట్యాంకులు ఉన్నాయన్నారు. వీటిలో 70 శాతం వరకు శుభ్రం చేశారని, మిగిలిన వాటిని కూడా ఆయా కార్యదర్శులు సమక్షంలో చేపట్టాలన్నారు. తాగునీటి కోసం సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



బోరు మరమ్మతులు చేపడుతున్న మెకానిక్‌లు

సేవలే గుర్తింపునిస్తాయి



పైడి వెంకటరమణ సన్మాన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో ఎంతో మంది ఆప్తులను సంపాదించుకున్న పైడి వెంకటరమణ ఎంతోమంది ప్రముఖుల మధ్య గౌరవంగా ఉద్యోగ విరమణ పొందడం అదృష్టమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పదవీ విరమణ చేసిన వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ అభినందన సభ శుక్రవారం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది వెంకటరమణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం, మామిడి శ్రీకాంత్, డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ ముద్దాడ చిన్నబాబు, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, డీఈఓ వెంకటేశ్వరరావు, మన్యం జిల్లా డీఎంహెచ్‌వో బగాది జగన్నాథరావు, ఏపీ ఎన్‌జీఓ సంఘ జిల్లా అధ్యక్షుడు సాయిరాం, రాష్ట్ర మాస్ మీడియా ప్రెసిడెంట్ సి.హెచ్.నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర మాస్ మీడియా ప్రెసిడెంట్ ఎ.ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 18 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ రోడ్డులో ఉన్న కాకినాడ శ్రీఆదిత్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తాజాగా జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో విప్రో టెక్నాలజీస్‌కు 18 మంది ఎంపికయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 269 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులను డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జీజీవీ సుబ్రహ్మణ్యం, ఆర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

'బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి'

హిరమండలం: బడి ఈడు కలిగిన పిల్లలు కచ్చితంగా బడిలో ఉండాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. మండలంలోని పిండ్రువాడ కాలనీలో బడికి పోతాం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం కోట్లాది రూపాయులు ఖర్చుపెడుతోందని, సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు రాయితీలు అందిస్తున్న విషయం గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, దీనకుమారి, గిరిబాబు, తారక రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి

ఎల్.ఎన్.పేట: పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో పైడి లతశ్రీ రైతులకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. రైతులు వరి విత్తనాలు వేసుకుని తక్కువ రోజులే అవుతున్నందున, నీరు నిల్వ ఉంటే విత్తనాల మొలక శాతం తగ్గిపోతుందని హెచ్చరించారు. వరి వెదలు, నారు మడులు సిద్ధం చేసుకున్న రైతులు పొలంలో నీరు లేకుండా చేయడం వలన విత్తనాలకు నష్టం జరగదన్నారు.